

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం, ఎమ్మెల్యే నాయకర్ తదితరులు

పేరుపాలెం బీచ్‌లో యోగాసనాలు

మొగల్తూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):భారతీయ వారసత్వ సంపద యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతీ సాధకుడు కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి కోరారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం పేరుపాలెం బీచ్‌లో సామూహిక యోగా భ్యాసన ప్రారంభించి మాట్లాడారు. యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మే 21 నుంచి జూన్ 21 వరకూ కొనసాగే యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ నయీం అస్మి, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ వేద తదితరులు పాల్గొన్నారు.

యోగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

భీమవరం టౌన్ : 'జిల్లాలో కొందరు ఎంపీడీవోలు యోగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం' అని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. యోగాంధ్ర నిర్వహణలో జిల్లా ప్రథమస్థానంలో ఉండేలా కష్టపడి పని చేయాలన్నారు. యోగాభ్యాసనకు హాజరైన వారితో క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేయించాలన్నారు.

పీజీఆర్ఎస్‌లో 15 ఫిర్యాదులు



భీమవరం క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం అందిస్తామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకున్నారు. మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇనస్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్ అహ్మదున్నీషా తదితరులు పాల్గొన్నారు.

ఆశలన్నీ వారిపైనే



కైకలూరులో కలెక్టర్ వెట్రిసెల్వికి కొల్లేరు ప్రాంతాన్ని చూపిస్తూ వివరిస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, పత్సమట్ల

నేడు, రేపు కొల్లేరు గ్రామాల్లో కేంద్ర సాధికార కమిటీ పర్యటన

కొల్లేరు ఆపరేషన్ అనంతరం నెలకొన్న కష్టనష్టాలు, ప్రజల జీవన విధానం, మిగులు భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీ కొల్లేరులో రెండు రోజులపాటు అధ్యయనం చేయనుంది. అత్యంత కీలకమైన సాధికార కమిటీ ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్థానికులు, ప్రజా ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను రాత పూర్వకంగా స్వీకరించనుంది. కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మంగళ, బుధవారాల్లో సాధికారిత కమిటీ పర్యటనకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

- కొల్లేరు పర్యావరణ పరిరక్షణ ప్రజల జీవన స్థితిగతులపై అధ్యయనం
- ప్రజాప్రతినిధులు, స్థానికుల అభిప్రాయాల సేకరణ
- అన్ని అంశాలపై పరిశీలన, అధ్యయనం
- పందిరిపల్లిగూడెంలో స్థానికులతో ముఖాముఖి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

2006లో జరిగిన కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఈ సరస్సుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడమే కాకుండా, కొందరు ఉల్లంఘిస్తున్నారన్న వాదన లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే కొల్లేరు వాస్తవ పరిస్థితులను జల్లెడ పట్టి తుది నివేదికను మూడు నెలల్లోపు సమర్పించేందుకు వీలుగా సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యులతో కూడిన సాధికార కమిటీని పంపుతోంది. కొల్లేరు పరిధిలో ఎన్ని గ్రామాలున్నాయి, ఎన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి, వారి జీవన విధానం, కొల్లేరు ఆపరేషన్ తదుపరి మార్పులు, జీవన ప్రమాణం మెరుగుపడిందా లేదా అనే అంశాలపై మానవీయ కోణంలో పరిశీలిస్తారు. 2006కు ముందు సాధికార కమిటీ కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. తర్వాత మరోమారు ఇదే కమిటీ అధ్యయనానికి రాబోతుంది. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితమే సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కొల్లేరు ప్రాంత ప్రజా ప్రతినిధులు, అధికారులు సాధికార కమిటీ ఎదుట ఎలాంటి అంశాలను ప్రస్తావించాలో సూచనప్రాయంగా తెలియజేశారు. ఆ ప్రాంతంలో నెలకొన్న స్థితిగతులు మానవీయ కోణంలో



పందిరిపల్లిగూడెంలో సభా వేదిక ఏర్పాట్లు

పరిష్కారం లభించేలా చూడాల్సిందిగా కొల్లేరువాసులు కోరుకుంటున్నట్లు యంత్రాంగం వ్యవహరించాలన్న ధోరణిలోనే కమిటీ సందర్శించనున్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించారు. కైకలూరు పరిధిలో అటపాక పక్షుల కేంద్రం, పందిరిపల్లిగూడెం ప్రాంతాల్లో కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. పందిరిపల్లిగూడెం వద్ద కొల్లేరు వాసులు తమ కష్టసుఖాలు సాధికార కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడే కొల్లేరు వాసులతో కమిటీ నేరుగా భేటీ అవుతుంది. ఒకవైపు అటవీ శాఖాధికారులు, సంబంధిత శాఖాధికారులతో ఆరా తీస్తూనే ఇంకోవైపు పెద్ద సంఖ్యలో తరలివచ్చే కొల్లేరు వాసుల నుంచి కూడా వినతులను ఆలకించబోతున్నారు. పెద్ద ఎత్తున స్థానికులు రానుండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం కైకలూరు నియోజకవర్గం, బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో కమిటీ పర్యటించనుంది.

సభ్యులు వీరే :

- కొల్లేరులో పర్యటించనున్న కేంద్ర సాధికార కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. చంద్రశేఖర్ గోయల్, డాక్టర్ జేఆర్ భట్, ఎంఎస్ భానుమతి, సునీల్ లిమాయే, ప్రకాశ్ చంద్రభట్ ఉంటారు.

సమాయత్తంకండి : కలెక్టర్

కైకలూరు/ఉంగుటూరు/భీమడోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):కొల్లేరులోని వాస్తవ పరిస్థితులను సీఈసీ కమిటీకి వివరించేందుకు అధికారులు, ప్రజలు సమాయత్తం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో ఉప్పుటేరు, పందిరిపల్లిగూడెం, ఆటపాక పక్షుల కేంద్రాన్ని, మణుగులూరు, పుల్లపర్రు గ్రామాలను ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎఫ్‌వో బి.విజయ, కైకలూరు రేంజర్ రామలింగాచార్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు సాధికార కమిటీ మంగళవారం శ్రీపర్రు, మణుగులూరు, అటపాక పక్షుల కేంద్రం, పందిరిపల్లిగూడెంలో కొల్లేరు ప్రజలను కలుస్తారు. అనంతరం దెందులూరు మండల గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. మూడు గంటలకు పందిరిపల్లిగూడెంలో కొల్లేరు లంక గ్రామాల ప్రజలు అర్జీలను కమిటీకి అందిస్తారు. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో కైకలూరు, మండవల్లి మండలాల కొల్లేరు ప్రజల సమస్యలను చెప్పుకునేందుకు సభా వేదికను ఏర్పాటుచేస్తున్నారు.

కమిటీ పర్యటన ఇలా..

- సాధికార కమిటీ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఏలూరు రాక.
- మధ్యాహ్నం 1.30 నుంచి నాలుగు గంటల మధ్య కలకుర్రు, మణగునూరు, అటపాక, కొల్లేటికోట సందర్శన.
- సాయంత్రం నాలుగు గంటలకు కొల్లేటికోటలో కైకలూరు, ఉండి మండలాల జిరాయితీ భూములు రైతులు, కొల్లేరు వాసులతో సమావేశం.
- సాయంత్రం ఐదు గంటలకు పైడిచింతపాడు మీదుగా ఏలూరు బయలుదేరతారు.
- సాయంత్రం ఆరు గంటలకు కలెక్టరేట్‌లో దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు మండలాల జిరాయితీ భూముల రైతులు, కొల్లేరు వాసులు, అధికారులతో సమావేశం అవుతారు.
- 18న ఉదయం ఎనిమిది గంటల నుంచి 12.30 గంటల వరకు నిడమర్రు చేరుకుని జిరాయితీ భూములను, కొల్లేరు అభయారణ్య ప్రాంతాలను పరిశీలిస్తారు.



ప్రజలకు జీవనోపాధిని కల్పించాలి

పర్యావరణం, పక్షులు ఎంత అవసరమో ప్రజల జీవనోపాధి కల్పించడం అంతే అవసరం. కొల్లేరులో ప్రజలు ఉన్నట్లు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లామని ప్రత్యేక న్యాయనిపుణులతో కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులను కోర్టులో వాదనలు వినిపించడంతో సుప్రీంకోర్టు సాధికారిక కమిటీ పరిశీలిస్తుంది. సీఈసీ పర్యటనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

- కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే



సమస్యను సీఈసీ దృష్టికి తీసుకువెళ్లాలి

కొల్లేరు సమస్యను అర్జీల రూపంలోనే ప్రజలు కమిటీకి వివరించాలి. పర్యావరణం, పక్షులతో పాటు ప్రజలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం. సీఈసీ కమిటీ పూర్తిగా అధ్యయనం చేసేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం. కైకలూరు, మండవల్లి మండలాలతో పాటు ఉంగుటూరు, నిడమర్రు, కొల్లేరు గ్రామాల్లో సైతం కమిటీ పర్యటిస్తుంది.

- పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే

తల్లికి వందనానికి

విద్యుత్ షాక్

- బిల్లులతో లబ్ధిదారుల కుస్తీ
- సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

తణుకు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే.. అందరికి వారి తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు చొప్పున ఈ నెల 12న ప్రభుత్వం జమ చేసింది. అయితే వివిధ కారణాల వల్ల కొందరు అనర్హుల జాబితాలో వున్నారు. ఇలాంటి వారంతా తమకు సొమ్ములు ఎందుకు రాలేదో చెప్పాలని సమీప సచివాలయాల వద్దకు వెళ్లి సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం లబ్ధి పొందాలంటే ఇంటి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదనే నిబంధన వుంది. చాలా మంది లబ్ధిదారులు విద్యుత్ బిల్లుల కారణంగా తమకు సొమ్ములు అందలేదని తెలుసుకుని సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి బిల్లులు సరిచూసుకుంటున్నారు. మూడు రోజులుగా తణుకు మండలం తేతలి సబ్‌స్టేషన్ వద్దకు క్యూ కడుతున్నారు. రికార్డులు పరిశీలించిన అధికారులు కొందరికి బిల్లులో ఉన్న యూనిట్లకంటే తక్కువ, ఎక్కువ వినియోగించినట్లు గుర్తించారు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఆకివీడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):భూమి లేకున్నా ఉన్నట్లు చూపించడం, ఇంటిల్లిపాది సపరేటు రేషన్ కార్డులున్నా, హౌస్‌హోల్డ్ పద్ధతిలో కలిసి ఉన్నట్లు చూపడంతో చాలా మంది అర్హులు అనర్హులుగా మిగిలిపోయారు. వారం తా సచివాలయాల వద్దకు క్యూ కట్టి తమనెం దుకు అనర్హులుగా మిగిల్చారని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. సోమవారం ఆకివీడు సచివాలయాలకు బాధితులు క్యూకట్టారు. అక్కడ సిబ్బంది లేకపోవడంతో సమాధానం చెప్పేవారు కరువవడంతో ఆగ్రహించారు. బ్యాంకుల ఖాతాలో పడ్డాయేమోనని అక్కడకు వెళ్లడంతో రద్దీగా కనబడ్డాయి. బాధితులు వార్డుల్లో ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు.




• మీటరు లేకున్నా 300 యూనిట్లు



వీరభద్రపురానికి చెందిన నాకు ఇల్లు వున్నా నా పేరున అసలు విద్యుత్ మీటరే లేదు. అయితే నా విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువగా వుందని చూపించారు. అందుకే నలుగురు పిల్లల్లో ముగ్గురు స్కూళ్లకు వెళుతున్నా తల్లికి వందనం సొమ్ములు రాలేదు.

- ఇండవల్లి దిలీప్, వీరభద్రపురం

• 300 యూనిట్లు రాకపోయినా...



ఏడాది క్రితం కొత్త విద్యుత్ మీటర్ ఏర్పాటు చేశారు. ఏ నెలలోను 300 యూనిట్లు వినియోగించినట్లు బిల్లులు రాలేదు. అయితే తల్లికి వందనం పథకంలో మాత్రం నెలకు 300 యూనిట్లపైనే విద్యుత్ వినియోగం వలన పథకంలో సొమ్ములు రాలేదని చూపుతున్నారు.

-కర్రి యేసు, వేల్పూరు

• 222 యూనిట్లు వచ్చినా



నాకు విద్యుత్ బిల్లులు ఏ నెలలోనూ 200 యూనిట్లు పెరగలేదు. ఈ ఏడాది మే లో 222 యూనిట్ల కరెంట్ బిల్లు వచ్చింది. ఈ కారణంగా నా ఇద్దరు పిల్లలకు సంబంధించిన తల్లికి వందనం సొమ్ములు అందలేదు.

- తానేటి మధుషీలా, పైడిపర్రు



కుండపోత

భీమవరంలో సోమవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో అరగంట పాటు కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. 5లో

1,734 విద్యుత్ కనెక్షన్ల

క్రమబద్ధీకరణ



- 50 శాతం రాయితీపై నెలాఖరుతో ముగియనున్న గడువు

భీమవరం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):గృహ విద్యుత్ వినియోగంలో అధిక లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పించడంతో జిల్లాలో దరఖాస్తులు చేసుకున్న 1,734 మంది విద్యుత్ కనెక్షన్‌లను క్రమబద్ధీకరించారు. దీని ద్వారా జిల్లా నుంచి 34 లక్షల 05 వేలు ఆదాయం వచ్చింది. కిలో వాట్ నుంచి ఐదు కిలో వాట్ వరకు క్రమబద్ధీకరించేందుకు రాయితీలు ఇచ్చింది. మార్చి ఒకటో తేదీ నుంచి మొదలైన ఈ ప్రక్రియ ఈ నెల 30తో ముగియనుంది. జిల్లాలో విద్యుత్ వినియోగం అధికం. విద్యుత్ కనెక్షన్లు వేసుకునే సమయంవ తక్కువ కిలోవాట్స్‌కు దరఖాస్తులు చేసుకుంటున్నారు. తర్వాత ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్‌లు ఉపయోగిస్తున్నారు. దీనివల్ల అంచనాలకు మించి విద్యుత్ వినియోగం అవతుంది. ఫలితంగా ఆయా ఇళ్లల్లో లో ఓల్టేజ్ సమస్య ఏర్పడుతుంది. అర్ధంతరంగా ఫీజులు కొట్టేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు నోచుకోవడం జరుగుతోంది. ఇలాంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని కొత్త విద్యుత్ కనెక్షన్‌లకు రెండు కిలో వాట్‌లకు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తక్కువ లోడు విద్యుత్ కనెక్షన్‌లు పొందిన వారు అదనపు లోడు వినియోగిస్తున్నారు. ఇలా వాడుతున్న వారిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం కిలోవాట్స్‌ను క్రమబద్ధీకరించేందుకు 50 శాతం రాయితీ కల్పించింది. గడువు దాటితే మరలా కిలోవాట్‌కు గతంలో ఉన్న ధరను చెల్లించాలి. వినియోగదారులు అధిక లోడు క్రమబద్ధీకరణ దరఖాస్తును www.apeasternpower.comలో దరఖాస్తు చేసుకోవాలి. దీనిని బట్టి అధికారులు లోడును క్రమబద్ధీకరిస్తారు.

50 శాతం రాయితీ ఇలా..

అదనపు లోడు	అసలు ధర	తగ్గింపు ధర
1 కిలో వాట్‌కు	2,250	1,250
2 కిలో వాట్‌కు	4,450	2,450
3 కిలో వాట్‌కు	6,650	3,650
4 కిలో వాట్‌కు	8,850	4,850
5 కిలో వాట్‌కు	11,050	6,050

డివిజన్‌ల వారీ దరఖాస్తులు

డివిజన్	వచ్చిన దరఖాస్తులు	ఆదాయం(రూ.లక్షల్లో)
భీమవరం	338	6.36
నరసాపురం	373	6.94
తాడేపల్లిగూడెం	1,023	20.76
మొత్తం	1,734	34.05

డ్రైవింగ్ చేసేదిలాగేనా..?

అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగేదెవర్రా అంటూ ఇష్టారాజ్యం - 4లో..

అంతా మా ఇష్టం..!






భీమవరంలో నంబర్ లేని వాహనాలపై రయ్..రయ్

ఎవరి దారి వారిదే.. ట్రాఫిక్ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు నడపటం...ఇలా నిబంధనలు పాటించకుండా నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తూనే ఉన్నారు. భీమవరం పట్టణం ఇటీవల జిల్లా కేంద్రం కావడంతో వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుని వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు.





సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్ రైడింగ్..



ఫొటోలు :
- ఫొటోగ్రాఫర్
భీమవరం /ఏలూరు




ఏలూరులో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



వాహనాల చట్టం ప్రకారం ట్రిబుల్ రైడింగ్ నేరం.. కానీ భీమవరం పట్టణంలో ముగ్గురు కాదు.. ఏకంగా ఆరుగురు ఒకే బైక్‌పై ప్రయాణిస్తుండగా చూసిన జనం జాగ్రత్త సోదరా.. అంటూ సలహా ఇచ్చారు...



అడ్డదిడ్డంగా..




నంబర్ ప్లేటు మాకెందుకు





పట్టెన్నపాలెం బ్రిడ్జికి మోక్షం లేదా ?

జంగారెడ్డిగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై బ్రిడ్జి పనులకు కూటమి ప్రభుత్వం రూ.3.2 కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదు. ప్రస్తుతం మంజూరైన నిధులు మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోతే ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వర్షాకాలంలో జల్లేరు వాగు పొంగితే పట్టెన్నపాలెం నుంచి ఏజెన్సీ గ్రామాలకు, ఏజెన్సీ గ్రామాల నుంచి జంగారెడ్డిగూడెం వైపుకు రాకపోకలు నిలిచి పోతాయి. వాగు ఉధృతంగా ప్రవహించి నప్పుడు అనేక మంది రైతులు, ప్రజలు వాగులో ప్రమాదవశాత్తు పడి మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ఘటనలను ఆధారం చేసుకుని ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వ సహకారంతో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కృషితో రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్) నిధులు రూ.కోటితో పట్టెన్న పాలెంలోని జల్లేరు వాగు బ్రిడ్జి పక్క నుంచి కాజ్‌వే నిర్మాణానికి ఆర్ అండ్ బి శాఖ చర్యలు చేపట్టింది. భీమవరానికి చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరు దక్కించుకుని పనులు నిర్వహిస్తున్నది. ప్రధాన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రజలు ఇబ్బందులు పడ కుండా కాజ్‌వే నిర్మాణం చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

• వేగంగా కాజ్‌వే పనులు

పట్టెన్నపాలెంలోని జల్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచాం. ఇప్పటి వరకు ఎవరూ టెండరు వేయలేదు. ఈ వర్షాకాలంలో ప్రజలు జల్లేరు వాగు వల్ల ప్రమాదాల బారిన పడకుండా ఉండటానికి ప్రభుత్వం ప్రస్తుతానికి కాజ్‌వే నిర్మాణానికి ఎస్‌డిఆర్ఎఫ్ నిధులు రూ.కోటి మంజూరు చేయడంతో ఆ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలం రాకుండానే పనులు పూర్తి చేసేలా కృషి చేస్తాం.ప్రధాన బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా కూడా ప్రజలు కాజ్‌వే ఉపయోగించుకోవచ్చు.

సీహెచ్.హరికృష్ణ, ఆర్అండ్‌బీ డీఈఈ, జంగారెడ్డిగూడెం

పెదవేగి జడ్పీ స్కూల్‌లో అవస్థలు

మరుగుదొడ్లు లేక విద్యార్థుల ఇబ్బందులు

పెదవేగి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 280 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వారిలో సగంమంది బాలికలు ఉన్నారు. ఇక్కడ బాలికలకు సంబంధించి మూడు టాయిలెట్‌లు మాత్రమే ఉన్నాయి. మరుగుదొడ్లు ఒక్కటి కూడా లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాలురతో పాటు పాఠశాల సిబ్బందికి ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు. దీంతో పాఠశాలకు సమీపంలోఉన్నచెరువు గట్టే ప్రస్తుతం విద్యార్థుల మూత్ర విసర్జనకు ఉపయోగపడుతోంది. ఆ చెరువు కూడా జల్‌జీవన్ మిషన్‌లో లోతుగా తవ్వడం, వర్షాకాలం కావడంతో అటుగా వెళ్లే విద్యార్థులు ప్రమాదానికి గురవుతారనే ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారు. దీనిపై గ్రామానికి చెందిన తొంటా తాతయ్య అనే వ్యక్తి రెండు పర్యాయాలు పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతులు అందించారు. గత ఏప్రిల్ 28వ తేదీన మరోసారి కలెక్టర్‌కు అర్జీ పెట్టాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి మరుగుదొడ్ల సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పెదవేగి వచ్చి, పాఠశాలల పునఃప్రారంభం నాటికి మరుగు దొడ్లను నిర్మిస్తామని సమస్య పరిష్కార మైనట్లు సంతకం పెట్టాలని చెప్పడంతో ఫిర్యాదుదారుడు సంతకం పెట్టేశాడు. దీంతో సమస్య పరిష్కారమైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ పైఅధికారులకు నివేదించారు. ఇప్పుడు పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.హైస్కూల్ వరకు గత విద్యా సంవత్సరం ఆధారంగా బాల బాలికలు 240 మంది ఉన్నారు. ఇంటర్మీడి యట్‌కు సంబంధించి మరో 33 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల సిబ్బంది 15 మంది ఉన్నారు. బాలికలకు ఉన్న మూడు మూత్రశాలలు కూడా అధ్వాన్నంగా ఉన్నాయి. మొత్తంగా 300 మంది వరకు ఉన్న ఈ పాఠశాలలో కనీసం 20 మరుగు దొడ్లు ఉండాలి.



పాఠశాల.. పక్కనే ఉన్న చెరువు



అధికారులు దృష్టి పెట్టాలి



ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం 5గంటల వరకు. 8 గంటల పాటు అదే పాఠశాలలో ఉండాలి. 140 మంది బాలికలు ఉన్న ఈ పాఠశాలలో కేవలం మూడు మూత్రశాలలు మాత్రమే ఉంటే విద్యార్థినుల పరిస్థితి ఏమిటి.? కొంతమంది తల్లిదండ్రులు మరుగుదొడ్లు లేకపోతే మా పిల్లలను పాఠశాలకు పంపమంటున్నారు. అధికారులు స్పందించి, మరుగుదొడ్లు నిర్మించి విద్యార్థుల అవస్థలను తొలగించాలి..

- పజ్జూరి శివన్నారాయణ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్

డేంజర్‌లో నారాయణపురం వంతెన

ఉంగుటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలో డెల్టా-మెట్ట ప్రాంతాన్ని కలిపే నారాయణపురం వంతెన శిథిలావస్థకు చేరి కూలే పరిస్థితిలో ఉంది. 1932లో ఈ వంతెన నిర్మించారు. సుమారు తొంభై మూడేళ్ల సేవలందించిన ఈ వంతెన ఇటీవల లోడు లారీలు, చేపలు, క్వారీ లారీలు విపరీతమైన రద్దీ పెరగడంతో వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఆదివారం వంతెన ఎడమ వైపు అంచులు కుంగడంతో పాటు వంతెన కింది భాగంలో పెచ్చులూడిపోయాయి. దీంతో అప్రమత్తమైన ఆర్‌అండ్‌బీ అధికారులు తారు డబ్బాలను అడ్డుగా పెట్టి భారీ వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ద్విచక్ర వాహనదారులను మాత్రమే అనుమతిస్తున్నారు. సుమారు 150 గ్రామాల ప్రజలకు మార్గమైన ఈ వంతెన శిథిలావస్దకు చేరడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల దృష్టికి ఈ వంతెన సమస్య తీసుకువెళతానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చెప్పారు. తక్షణం నిధులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తానన్నారు. మూడేళ్ల క్రితం మట్టి పరీక్షలు నిర్వహించి బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.50 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

వంతెన నిర్మించాలి



చాలా పురాతన వంతెన ఇది. ఎప్పటి నుంచో మరమ్మతులకు గురైంది. అత్యవసరంగా ఈ వంతెన నిర్మించకపోతే సుమారు 150 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదముంది.పాలకులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

నల్లా ఆనంద్, స్థానికుడు



డబ్బాలను అడ్డు పెట్టి ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీసులు



వంతెన అంచుకు పడిన రంధ్రం

ప్రోబ్లమ్ జోన్



పెనుమంట్ర-నత్తారామేశ్వరం దారిలో మట్టితో పేరుకుపోయిన రోడ్లు

జారి పడతారు..జాగ్రత్త !

మట్టి పేరుకుపోయి రహదారులు బురదమయం

పెనుమంట్ర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెనుగొండ - నత్తారామేశ్వరం రహదారిపై ప్రయాణిస్తున్నారా..అయితే వర్షం కురిస్తే తస్మాత్ జాగ్రత్త. ఇరగవరం మండలం కంతేరు నుంచి పెనుమంట్ర మండలం జుత్తిగ వరకు మట్టి మాఫియా వేసవి కాలంలో రాత్రి పగలు తేడా లేకుండా మట్టి రవాణా చేశారు. రోడ్లపై మట్టి బెరడ్లు పడి మట్టి పేరుకుపోయింది. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే రహదారి బురదగా మారి వాహనాలు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది పెనుగొండ మండలం వడలిలో ఆర్‌అండ్‌బీ రహదారిపై యాక్టివా అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు దెబ్బ తగిలి అక్కడకక్కడే ఇద్దరు మహిళలు మృతి చెందారు. రహదారులన్నీ ప్రయాణికులకు శాపంగా మారాయి. అధికారులు కళ్ళు తెరిచి రహదారిపై ఉన్న మట్టి సుద్దలను తొలగించి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జారుడు బల్లలా గొల్లల కోడేరు- మహదేవపట్నం రోడ్డు

పాలకోడేరు : గొల్లలకోడేరు- మహదేవపట్నం గ్రామానికి వెళ్ళే రహదారి జారుడు బల్లలా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొల్లలకోడేరు గ్రామం మీద నుంచి మహదేవపట్నం, ఉండి వెళ్ళేందుకు ఇది ఎంతో అనువైన మార్గం. పంట పొలాల మధ్యలో నుంచి గొల్లలకోడేరు గ్రామం నుంచి మహదేవపట్నం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్ రహదారి ఉంది. ఈ రహదారికి ఐదు సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గొల్లలకోడేరు పరిధిలో ఉన్న రహదారి మొత్తం పూర్తిగా పాడై పోయింది. గోతులు పడి బురదమయంగా మారింది. ఈ వేసవిలో మట్టి ట్రాక్టర్లతో ట్రాక్టర్ల ద్వారా, లారీలతో మట్టిని తోలుకెళ్ళడంతో రహదారిపై మట్టిబెడ్డలు పడి జారుడు బల్లలా తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు జారిపడి గాయాలపాలయ్యారు. ఈ రహదారి వెంబడి పంట పొలాలతోపాటు సీతారామపురం, తమ్మగుంటపాలెం, తోడిగుల్లవారిపాలెం, గుబ్బలవారి పాలెంలలో ప్రజలు నివసిస్తారు. నిత్యం వారంతా ఈ రహదారి మార్గం మీదే ప్రయాణాలు సాగించాల్సి ఉంటుంది. అటువంటి ఉపయోగకరమైన రహదారి పూర్తిగా పాడవడంతో గొల్లలకోడేరు ప్రాంత వాసులే కాకుండా ఉండి మండల ప్రజలు కూడా ఈ రోడ్డుకి మోక్షం కల్పించాలని కోరుతున్నారు.





జీఅండ్‌వీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

తూడు తొలగించండి సారూ !

పెనుమంట్ర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలంలోని ప్రధాన సాగు నీటి కాల్వ అయిన గోస్తనీ వెంకయ్య కాలువ పరిధిలోని మాముడూరు బ్రిడ్జి వద్ద ఎగువ నుంచి వచ్చిన చెత్తాచెదారం, తూడు పేరుకు పోవడంతో ప్రవాహానికి అవరోధం ఏర్పడింది. వేసవిలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు మందు పిచికారీ చేస్తారని కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో బ్రిడ్జి వద్ద తూడు గుర్రపు డెక్క ప్రవాహానికి అడ్డుగా మారింది. వేల్పూరు నుంచి కాశీపట్నం వరకు ఈ కాలువ ద్వారా తాగు సాగునీరు సరఫరా జరుగుతుంది. భీమవరం పట్టణానికి దాహార్తిని తీర్చే ప్రధాన కాలువ అయిన జిఅండ్‌వీ కెనాల్ కెనాల్‌లోని వ్యర్థాలు, గుర్రపుడెక్క, తూడు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆచంట : మండలంలో ఉన్న ప్రధాన మురుగుడ్రెయిన్‌లు అనేక చోట్ల గుర్రపు డెక్కతో నిండి ఉంది. మండలంలో తాడేరు, కొరాలపర్రు, నక్కల డ్రెయిన్లు ఉన్నాయి. కొన్నిచోట్ల ఉపాధి కూలీల ద్వారా తూడు తొలగించినప్పటికి ఇంకా అనేక చోట్ల గుర్రపు డెక్కతో డ్రెయిన్లు నిండి ఉన్నాయి. కనీసం గుర్రపుడెక్క అయినా పూర్తిస్థాయిలో తొలగించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన తాడేరు డ్రెయిన్

ఏటిగట్టు..తవ్వి వదిలేశారు..



పోలవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో గూటాల తాడిపూడి గ్రామాల మధ్య ఏటిగట్టుకి ఇసుక ర్యాంపు నిర్వహణ కోసం భారీ గండికొట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాల సీజను ప్రారంభమైంది . దీనికి తోడు గోదావరి నీటిమట్టం కూడా క్రమక్రమంగా పెరుగుతోంది. గోదావరి నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకున్న సందర్భాల్లో ఈ గండి కొట్టిన ప్రాంతాల నుంచి గోదావరి జలాలు ప్రవహిస్తే ఏటిగట్టు కోతకు గురై పెనుప్రమాదం జరిగి గ్రామాలు పంటపొలాలు నీటమునిగే ప్రమాదముంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తీసిన సిల్ట్ తీసినట్లే.. డ్రైనేజీలోకి..

నరసాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎండా కాలంలో చేయాల్సిన పనుల్ని వానలు పడుతున్న సమయంలో చేయడంతో లక్షల రూపాయలు వృథా అవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న మునిసిపాలిటీ తాజాగా చేపట్టిన డ్రైనేజీ లోంచి సీల్ట్ తొలగింపు పనులపై కూడా ప్రజలు నుంచి విమర్శలు ఎదురుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నరసాపురంలో సుమారు 26 కిలోమీటర్ల మేర మేజర్ డ్రైనేజీలు విస్తరించాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఈ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగిస్తుంటారు. అయితే ఈసారి రూ 40 లక్షలతో టెండర్లు పిలిచారు. అయితే ఈపనుల్ని ఎండాకాలంలో చేపట్టకుండా వర్షాలు కురుస్తు న్నప్పుడు ఆగమేఘాలపై ప్రారంభించారు. వర్షాలు పడుతుండటంతో చేసిన పనులకు ప్రయోజనం లేకుండా పోతోంది. డ్రైనేజీ ల్లోంచి తీసిన సీల్ట్ తీసినట్లే.. వర్షాలకు మళ్లీ డ్రైనేజీ ల్లోకి జారిపోతుంది. రహదార్లపైకి బురద వస్తుండంతో ప్రజలు వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. చేస్తున్న పనులకు ఉపయోగం లేకుండా పోతోందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.





విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద మాట్లాడుతున్న మంత్రి

ఐదేళ్లలో నాపై 25 అక్రమ కేసులు పెట్టారు

వాయిదాలకు ప్రజా ప్రతినిధుల కోర్టుకు మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో తనపై అక్రమంగా 25 కేసులు బనాయించారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. వాయిదాలకు హాజరవుతున్నానని, ఈ నెల 23 నాటికి మరలా వాయిదా వేసినట్టు తెలిపారు. 2019 ఆగస్టులో వైసీపీ ప్రభు త్వం ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు వారికి న్యాయపరంగా అండగా నిలిచినందున ఆనాడు తనపై అక్రమ కేసు పెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకూ ఐదేళ్ళుగా విజయ వాడలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరవుతున్నానని వివరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం రెడ్ బుక్ గురించి వైసీపీ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. 2014లో తొలిసారిగా, 2019లో రెండోసారి నాపై ఒక్క ఎఫ్ఐఆర్ లేదని మూడోసారి 2024లో మాత్రం 5 ఏళ్లలో 25 కేసులు నమోదు అయినట్టు అఫిడవిట్ దాఖలు చేయాల్సి వచ్చిందని మంత్రి నిమ్మల తెలిపారు. ఐదేళ్లు కక్షపూరితంగా కేసులు పెట్టి వేధించారని అన్నారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, ధనాని ప్రకాష్ తదితరులు ఉన్నారు.

19న ఐదు వేల మందితో యోగా



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

భీమవరంటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఈ నెల 19న రాష్ట్ర స్థాయి సన్నద్ధత సామూహిక యోగా కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ నాగరాణి, ఇతర ఉన్నతాధికారులు బీవీ రాజు కళాశాలలో ఏర్పాట్లు పరిశీలించారు. ఐదు వేల మంది అథ్లెట్లు, స్పోర్ట్స్ పర్సన్స్, యువత పాల్గొంటున్నారని తెలిపారు. విష్ణు కాలేజీ ప్రాంగణంలోని నాలుగు ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమానికి అధికారులు భారీ ఏర్పాట్లకు ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు అవుతారన్నారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సంకు అప్పారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సంకు అప్పారావు జీవితం స్ఫూర్తిదాయకం

తణుకు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు సంకు అప్పారావు జీవితం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం అప్పారావు 109వ జయంతి సందర్భంగా తణుకు స్వాతంత్ర్య సమర యోధుల పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుమార్తె సంకు మనోరమ మాట్లాడుతూ తన తండ్రి తణుకు హైస్కూలులో చదివారని, మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ వంటి ప్రముఖుల సహాధ్యాయులని తెలిపారు. స్వరాజ్య ఉద్యమంలో 1937లో కమ్యూనిస్టు పార్టీలో చేరారని, కాళీపట్నం జమిందారీ వ్యతిరేక పోరాటంలో తొలి సత్యాగ్రహ బృందానికి నాయకత్వం వహించి అరెస్టయ్యారని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ సంకు అప్పారావు ఆదర్శనీయుడన్నారు. డీవీవీఎస్ వర్మ, చల్లా హైమవతి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, వంక రామదాసు, భూపతిరాజు రమేష్ చంద్ర బాబు, పోరూరి మురళీకుమార్ మాట్లాడారు. ముందుగా సంకు అప్పారావు కుటుంబ సభ్యులు మనోరమ, సూర్యకుమారి, విజయకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సీఏటీ జడ్జిలు

ద్వారకాతిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ) జడ్జిలు సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన జడ్జిలు డా. లతా బస్వరాజ్ పాట్నే, షాలిని మిశ్రా(రిటైర్డ్ ఐఏఎస్), రిజిస్ట్రార్ జి. నవీన్‌కుమార్, కాట్ సిబ్బందికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. వీరంతా ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని అందించి వేదా శీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఏఈవో రమణరాజు, సూపరింటెండెంట్ హయగ్రీవ వారికి స్వామి వారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు.

బాల బాలికలకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం శనివారపుపేట లోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ప్రతి బాల బాలికలు గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం ఈ వసతి గృహంలో 9 మంది బాలలకు గుర్తింపు కార్డులు లేవని, కార్డుల జారీకి తగిన చర్యలను త్వరలోనే తీసుకుంటామని తెలిపారు. అలాగే వసతి గృహ సిబ్బందితో మాట్లాడుతూ బాలలకు పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. బాలుర వసతి గృహ సూపరింటెండెంట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల అభ్యంతరాలపై గ్రీవెన్స్ సెల్

ఏలూరు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా పరిధిలోని 48 మండలాల ఉపాధ్యాయులకు ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్, మాన్యువల్ కౌన్సెలింగ్‌పై ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలుంటే వాటిని సరైన నమూనాలో తగిన ఆధారాలను జతచేసి ఏలూరు డీఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్‌లో అందజేయాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 76 మందికి, స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు 2274, ఎస్జీటీలు 2159, లాంగ్వేజ్ పండిట్లు 42, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 33 మందికి, ఆర్ట్/ డ్రాయింగ్/ క్రాఫ్ట్/ మ్యూజిక్/ ఒకేషనల్ ఉపాధ్యాయులు 16 మందికి కలిపి మొత్తం 4884 మందికి నిర్ణీత గడువులో ట్రాన్స్‌ఫర్లు పూర్తిచేశామన్నారు.

స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో గల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో స్పోర్ట్స్ విభాగంలో 62 మంది, ఎన్‌సీసీ 85, క్యాప్ విభాగంలో 12 మంది, భారత్ స్కౌట్ విభాగంలో 15 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు.





ఒక్కసారిగా..జోరువాన

భీమవరం టౌన్/ పోలవరం జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో ఒక్కసారిగా జోరు వాన కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో భీమవరంలో ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు రావడం గాలులు, ఉరుములతో వర్షం ప్రారంభమైంది. దాదాపు అర గంటపాటు కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. ఎక్కడివారు అక్కడే ఉండిపోయారు. భారీ వర్షంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పోలవరం మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పోలవరం మండల కేంద్రంలో మెయిన్ బజార్, బీసీ కాలనీ, కొత్తపేట, బాపూజీ కాలనీ, బెస్తావీధిలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దిగువ పోలవరంలో వర్షపు నీరు అటు గోదావరిలోకి, ఇటు కొవ్వాడ కాలువ ఛానల్‌లోకి వెళ్ళే మార్గం లేక వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచి నీటినిల్వలు పెరిగాయి. పట్టిసీమ, గూటాల కొత్తపట్టిసీమ గ్రామాలలో ఏటిగట్టుకి దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలు జలమయమై నివాసాల చుట్టూ నీరు చేరాయి.











భీమవరంలో అకస్మాత్తుగా వచ్చిన వర్షానికి జనం పరుగులు..

నారికేళం.. ప్రియం..

ధర ఆల్‌టైం రికార్డ్

వెయ్యి కాయలు పశ్చిమలో రూ.16 వేలు..

తూర్పులో రూ.18 వేలు

ఆగస్టు నాటికి రూ.25 వేలకు చేరే అవకాశం

రిటైల్ మార్కెట్‌లో కాయ గరిష్ట ధర రూ.30

పాలకొల్లు/యలమంచిలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నారికేళం ధరం మును పెన్నడూ లేని స్థాయిలో చుక్కలనంటుతోంది. పెరిగిన ధరలు ఆల్‌టైం రికార్డు నెలకొల్పాయి. పాత పశ్చిమగోదావరి జిల్లాలో రైతువారీ వెయ్యి కాయల ధర గరిష్టంగా రూ.16 వేలు ఉండగా, పాత తూర్పుగోదావరి జిల్లాలో రూ.18 వేలు ఉంది. ఈ ధరలు గత ధరలతో పోలిస్తే ఆల్‌టైం రికార్డుగా కనిపిస్తోంది. జులై మాసాంతం, ఆగస్టు నెల నాటికి ధరలు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గత ధరలతో పోలిస్తే పెరిగిన ధరలు రైతులకు సంతృప్తిని ఇస్తున్నప్పటికీ కొబ్బరి దిగుబడి, నాణ్యత తగ్గడంతో కొంతమేర ఆదాయాన్ని కోల్పోతున్నారు. గడచిన మూడు, నాలుగేళ్లలో ఈ ఏడాది మినహా కొబ్బరి ధరలు తక్కువగానే ఉన్నాయి. దీంతో రైతులు కొబ్బరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచలేదు. కొబ్బరిచెట్లకు సకాలంలో సేంద్రీయ, రసాయన ఎరువులు వేయక పోవడం, దుక్కి, నీటి తడులు ఎక్కువసార్లు పెట్టకపోవడంతో పాటూ, కొబ్బరిచెట్లకు తెగులుసోకడంతో కాయ పరిమాణం తగ్గింది. ప్రతి వంద కాయలలో 20 నుంచి 30 చిన్న కాయలు వస్తున్నాయి. ఈ కాయలను వర్తకులు రెండుకాయలను ఒక కాయగా లెక్కించి తీసుకుంటున్నారు. అంతేకాక వర్తకులు 100 కాయలకు ఆరు కాయలను శనగకాయలుగా పరిగణించి తీసుకెళ్లేవారు. ఇప్పుడు వర్తకులు సిండికేట్‌గా మారి నూటికి 10 కాయలను తీసుకోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు కొబ్బరి రైతులు సంతృప్తిగానే ఉన్నారు.పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. పచ్చికొబ్బరి గండేరా(డిల్లీ క్వాలిటీ) రూ.18వేల నుంచి రూ.20 వేలు పలుకుతోంది. కురిడీకాయలు రూ.25 వేలు ధర ఉంది. 70-80 బత్తీల



కాయలు వెయ్యి ధర రూ.10 వేలు ఉండగా, నెంబరు కాయల ధర రూ.11 వేలు ఉంది. సమీప రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ లో కొబ్బరి దిగుబడి కొంతమేర తగ్గింది. దీంతోపాటూ ఉత్తరాది రాష్ట్రాల్లో కొబ్బరి పరిశ్రమలు వినియోగించే ఎండు కొబ్బరి ఇండోనేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి దిగుమతి తగ్గిన కారణంగా ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరికి డిమాండ్ పెరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రాయలసీమ ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాలతో పాటూ గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఇంకా పలు ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతులు అవుతున్నాయి. కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటూ, భవిష్యత్తులోనూ మార్కెట్ నిలకడగా ఉంటుందని అంచనాలు ఉండటంతో కొబ్బరి రైతులు కొబ్బరిసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

వార్డు, సచివాలయ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

సొంత మండలాల్లో బదిలీ తప్పనిసరి

ఏలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో సచివాలయ, వార్డు ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం అవుతోంది. ఐదేళ్ల పూర్తి చేసిన వారిని బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉత్తర్వులు సోమవారం రాత్రి వెలువడ్డాయి. దీంతో ఉమ్మడి జిల్లాల్లో 8 వేల మంది బదిలీలకు అవకాశం ఉంది. డేటాను సంబంధిత అధికారులు సేకరించి, రేషనలైజేషన్ మోడ్‌లో జాబితాను 16 నుంచి 18వ తేదీల్లో తయారు చేస్తారు. రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు 22 నుంచి 24 వరకు గడువు ఇచ్చారు. 25 నుంచి 29వ తేదీలోగా జాబితాలను సరిచేసుకుని, రిక్వెస్ట్ దరఖాస్తులను పరిశీలించి ఐదేళ్లు పూర్తి చేసిన వారిని బదిలీ చేయనున్నారు. ఏవైనా అభ్యంతరాలు, విజ్ఞాపనలు కూడా ఈ నెలాఖరులోగా కలెక్టర్లు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో సొంత మండలాల్లో తిష్టవేసిన సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా వేరే మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం సొంత మండలంలోనూ ఉద్యోగం చేసేందుకు వీల్లేకుండా మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో వైసీపీ నాయకులను ప్రసన్నం చేసుకుని సమీప గ్రామాల్లో పనిచేస్తూ వచ్చిన ఉద్యోగుల కుర్చీలు ఖాళీ చేయాల్సి వస్తోంది. దూరం వెళ్లేందుకు ఇష్టంలేక చాలా మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పొరుగు మండలాల్లో పోస్టింగ్ పొందేందుకు సిఫార్సులు కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వం 2019 అక్టోబర్ 2 నుంచి సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చిన విషయం తెల్సిందే. రెండేళ్లకో బదిలీ ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఉద్యోగం పొందినప్పటి నుంచి ఒకేచోట పనిచేస్తూ వస్తున్నారు. గతేడాది సెప్టెంబర్లో జరిగిన సాధారణ బదిలీల సమయానికి సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు నిండలేదు. రిక్వెస్టు పెట్టుకోవడానికి అవకాశమివ్వడంతో 15 నుంచి 20శాతం మాత్రమే బదిలీలు జరిగాయి. ఈసారి పెద్ద ఎత్తున బదిలీ కానున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు, జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి తీర్పునిచ్చారు. మచిలీపట్నానికి చెందిన మేకల శ్రీకాంత్ కుమార్‌కు చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన గంగుల నాగ మల్లేశ్వరరావు రూ.7 లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ తీర్చే నిమిత్తం శ్రీకాంత్ కుమార్ ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లలేదు. ఈ నేపథ్యంలో నాగమల్లేశ్వరరావు కోర్టును ఆశ్రయించగా కేసును విచారించగా శ్రీకాంత్ కుమార్‌కు ఏడాది జైలు, రూ.9లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అనుచిత పోస్టులు పెడుతున్న వ్యక్తిపై ఫిర్యాదు



పోడూరు/ఆచంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న ఆచంటకు చెందిన బైరిశెట్టి ప్రవీణ్‌పై జనసేన పార్టీ నాయకులు పోలీసులకు సోమవారం ఆచంట, పోడూరులలో ఫిర్యాదుచేశారు. కూటమిలో గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తున్న ప్రవీణ్‌పై కఠినచర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ మండల నాయకులు రావి హరిష్‌బాబు, తోటేటి వేణులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోడూరు, ఆచంట పోలీసు స్టేషన్లలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రవీణ్‌పై జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు అందినట్టు తెలిపారు.

బాలికను గర్భవతిని చేసిన వ్యక్తికి యావజ్జీవం

భీమవరంక్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి):బాలికను బెదిరించి అత్యాచారం జరిపి గర్భవతిని చేసిన వ్యక్తికి భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. వీరవాసరం మండలం కొణితివాడకు చెందిన కండెల్లి రమేశ్ ఓ బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడంటూ 2020 జూలై 12న పోక్సో కేసు నమోదైంది. డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, వీరవాసరం ఎస్.ఐ. ఎం.రాజ్ కుమార్‌లు విచారణ చేపట్టి కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. దీంతో కండెల్లి రమేశ్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి లక్ష్మీనారాయణ తీర్పును వెల్లడించారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటరుగా బి.బ్రహ్మయ్య, డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ పి.నానిబాబు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ సహాయ సహకారాలు అందించారు. ఈ కేసులో నిందుతుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి అభినందించారు.

75 ఏళ్ల భార్యను హతమార్చిన 85 ఏళ్ల భర్త







వివరాలు సేకరిస్తున్న పోలీసులు.. హత్యకు పాల్పడిన వృద్ధుడు లక్ష్మణరావు.. రంగమ్మ మృతదేహం

- స్వగ్రామానికి వెళ్లేందుకు నిరాకరించిందని కర్రతో దాడి
- దెబ్బలకు తాళలేక వృద్ధురాలు మృతి

ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ఆ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.. ఆ ముగ్గురికీ వివాహాలు జరిపించారు. అయితే ఇద్దరు కుమార్తెలు వారి కుటుంబాలతో ఏలూరు శ్రీరామ్ నగర్ 9వ రోడ్డు ప్రాంతంలో ఒకేచోట ఉంటున్నారు. తల్లిదండ్రులైన బొబ్బా లక్ష్మణరావు (85), బొబ్బా రంగమ్మ(75) వారి స్వగ్రామమైన పెదపాడు మండలం రాజుపాలెంలోనే ఉంటున్నారు. అయితే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను తమ వద్దకే తెచ్చుకుని వారి ఆలనాపాలనా చూసుకోవాలని అనుకున్న కుమార్తెలు కొన్నేళ్ల క్రితం వారిని ఏలూరుకు తీసుకొచ్చి శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని తల్లిదండ్రులను ఓ ఇంట్లో ఉంచి, కేర్ టేకర్‌ను ఏర్పాటు చేసి వారి బాగోగులు చూస్తున్నారు. ఆ వృద్ధ దంపతులిద్దరూ ఒంటరిగా ఉండడం, ఇతరులు ఎవరూ మాట్లాడడానికి అందుబాటులో లేకపోవడంతో మానసికంగా కుంగిపోయారు. ఏడాది క్రితం లక్ష్మణరావుకు ఎడమ కాలుకు కూడా కొంత భాగం తొలగించడంతో వీల్‌ఛైర్‌లోనే ఉంటూ కర్ర సాయంతో నడుస్తున్నాడు. మానసిక ఆందోళనకు గురవుతున్న లక్ష్మణరావు తన స్వగ్రామం రాజుపాలెం వెళ్లిపోదామని రంగమ్మతో చెప్తున్నాడు. తమ పిల్లలు అంతా ఇక్కడే ఉన్నారని అక్కడకు వెళ్ళి ఏమి చేద్దామంటూ ప్రశ్నించి ఆమె వెళ్ళడానికి నిరాకరించింది. దీంతో ఈ నెల 15వ తేదీన వారిద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె తన భర్తపై అలిగి కుమార్తెల వద్దకు వెళ్లడానికి ప్రయత్నించింది. అయితే లిఫ్టులో ఎలా వెళ్ళాలో తెలియక రాత్రి వరకూ ఉండి తిరిగి భర్త వద్దకే వచ్చింది. దీంతో ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. అనంతరం ఏం జరిగిందో కాని సోమవారం వేకువజామున తన చేతి కర్రతో లక్ష్మణరావు భార్య రంగమ్మ చేతిపై కొట్టడంతో ఆమె చేయి విరిగిపోయి కిందపడిపోవడంతో ఆమెపై తీవ్రంగా దాడి చేశాడు. ఆమె మరణించిందో బ్రతికుందో తెలియని పరిస్థితి... సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. దీంతో లక్ష్మణరావు కుమార్తె పైడి విజయలక్ష్మి(50) ఫిర్యాదుతో త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, వారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలడిగి తెలుసుకున్నారు. మరోవైపు లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్య కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరి చెట్టు కట్ చేస్తుండగా ఒకరి మృతి



ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కొబ్బరి చెట్టును మిషన్‌తో కోసి ముక్కలను కిందకు దించే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు మండలం గాలాయిగూడేనికి చెందిన యడ్ల రాటాలు(50) కొబ్బరి చెట్లను మిషన్‌తో కోసి తొలగించే పనికి పెదవేగి మండలం విజయరాయి వెళ్లాడు. అక్కడ ఒక రైతు పొలంలో కొబ్బరిచెట్లను మిషన్‌తో చెట్టును చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి వాటిని కిందికి వేస్తున్నారు. ఈక్రమంలో యడ్ల రాటాలు కొబ్బరి చెట్టు ఎక్కి మిషన్‌తో కొబ్బరిచెట్టును కోసి ముక్కలు వేసే క్రమంలో అతనిమీదే పడింది. దీంతో తీవ్ర గాయపడటంతో తోటి కూలీలు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ప్రేమలో పడి మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య!

ఆచంట, జూన్ 16(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని యువతితో ప్రేమలో పడి మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కరుగోరుమిల్లి శివారు కడలివారిపాలెంలో చోటు చేసుకుంది. కడలి హరీశ్(25) పాలకొల్లు సాయి ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం డ్యూటీకి వెళ్లి అక్కడే ఉంటూ వారం రోజుల అనంతరం మరలా ఆదివారం ఉదయం ఇంటికి వస్తుంటాడు. గత ఆదివారం రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో ఈ నెల 15న రాత్రి 9.30 గంటల సమయంలో కాంపాటి నాగరాజు అనే వ్యక్తి ఫోన్ చేసి మీ అబ్బాయి ఇక్కడ మృతి చెందిపడిఉన్నాడని చెప్పడంతో అంతా నిర్ఘాంతపోయారు. కరుగోరుమిల్లి ఏటిగట్టు రోడ్డు పంట కాల్వ వద్దకు వెళ్లి చూడగా హరీశ్ మృతిచెందిపడిఉన్నాడు. తండ్రి కడలి వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొంత కాలంగా గుర్తుతెలియని యువతితో ప్రేమలో పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రెట్టింపు సొమ్ము ఇస్తామంటూ ఆశ చూపి మోసం

ముఠాను అరెస్ట్ చేసిన తాడేపల్లిగూడెం పోలీసులు

నలుగురి నుంచి రూ.4.20 లక్షలు స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మీరిచ్చే సొమ్ముకు రెట్టింపు డబ్బు వచ్చే మంచి డీల్ ఉంది.. రూ.500 నోట్లకు రూ.వంద నోట్లతో లక్ష ఇస్తే రెండు లక్షలు వస్తుందని ఓ ముఠా నమ్మించి లక్షల్లో మోసం చేసిన కేసును తాడేపల్లిగూడెం పోలీసులు ఛేదించారు. సోమవారం నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ డి.విశ్వనాథ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తెలంగాణలోని సూర్యాపేట మండలం పికులనాయక తండాకు చెందిన సోదా సోతు సాయికిరణ్, నాగరాజు సింహాద్రి మోహనరావులు స్నేహితులు. భీమడోలుకు చెందిన ఆర్కేరెడ్డి అనే ఆనంద్‌కు వీరితో పరిచయం ఉంది. దీంతో తన స్నేహితుడు సత్తిబాబు దగ్గర మంచి డీల్ ఉంది మన దగ్గర రూ.500 ఇస్తే దానికి రెట్టింపు నగదు రూ.100, 200 నోట్లు ఇస్తారని నమ్మించాడు. సాయికిరణ్, మోహనరావులు ఆశపడి సొమ్ము రెట్టింపు అవుతుందని భావించి రూ.5 లక్షల వరకూ ఈ నెల 13న తాడేపల్లిగూడెం తీసుకొచ్చారు. తాడేపల్లిగూడెం బస్టాండ్ వద్దకు వచ్చిన వారిని సత్తిబాబు, ఆనంద్‌లు కారులో ఎక్కించుకున్నారు. వెంట తెచ్చిన సొమ్ము చూపించాలని ఆనంద్ కోరగా సాయికిరణ్ తన బ్యాగ్‌లో ఉన్న డబ్బు బయటకు తీసి చూపించారు. ఈ విషయాన్ని కారుబయట నక్కి గమనిస్తున్న షేక్ సుభాని, పిల్లిబోయిన గణేశ్‌లు కారులోకి వచ్చి సాయికిరణ్, మోహనరావులను బెదిరించి వారి వద్ద ఉన్న సొమ్ముతో ఉడాయించారు. దీనిపై 15న తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పట్టణ సీఐ ఆది ప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సీఐ ఆది ప్రసాద్, ఎస్సైలు బాలం శ్రీనివాస్, నాగరాజులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు చేశారు. ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించి పోడూరు మండలం జున్నూరుకు చెందిన నక్కా సత్తిబాబు, భీమడోలు మండలం పాత అంబరుపేటకు చెందిన ఆనంద్, తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటకు చెందిన షేక్ సుభాని, జంగారెడ్డిగూడెంలోని రామచంద్రాపురానికి చెందిన పిల్లిబోయిన గణేష్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4.20, నగదు, కత్తి, బ్లేడుతో పాటు సూట్‌కేసు, క్యాష్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసులను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం, డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

నేడు కొమ్ముగూడెంలో కోకో రైతు సదస్సు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోకో రైతు సదస్సు మంగళవారం కొమ్ముగూడెంలో నిర్వహించనున్నట్టు కోకోరైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కోకో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి అందించే పథకాలు తదితర అంశాలు ఈ సదస్సులో చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు కోకోరైతు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ పాల్గొంటారని వివరించారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

ఆకివీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు అభయారణ్యం సమస్యలపై మంగళవారం కొల్లేరు పరిసర గ్రామాల్లో కేంద్ర బృందం (సీఈసీ కమిటీ) పర్యటిస్తుందని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం గ్రామంలో కొల్లేరు ప్రజలతో మధ్యాహ్నం 3 గంటలకు ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ సమావేశం నిర్వహిస్తారన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీవో



భీమవరం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా డీపీవోగా ఎస్.రామ్‌నాథ్ రెడ్డి, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎ.రాంబాబు పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.

బడికి రండి అంటూ ర్యాలీ

భీమవరం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో సోమవారం భీమవరంలోని గాలిరామయ్య మునిసిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో బాలల్లారా బండికి రండి అంటూ ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి



భీమవరం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భీమవరం మెంటేవారి తోటలోని వండర్ కిడ్స్‌లో సంస్కార భారతి ఆధ్వర్యంలో ఇటీవల గుజరాత్‌లో జరిగిన విమాన ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. అల్లు రామకృష్ణ, అల్లు వనజాక్షి మాట్లాడుతూ క్షణాల ముందు వీడ్కోలు చెప్పిన బంధుమిత్రులు ఇళ్లకు చేరక ముందే ఈ ఘటన కలిచివేసిందని, ఆ మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగసాయి, ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కాళ్ళలో సోలార్ వీధిలైట్లు



కాళ్ళ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) :కాళ్ల గ్రామంలో వెర్పాక్స్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ వీధి లైట్లను సంస్థ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ, గ్రామస్థులతో కలిసి సోమవారం ప్రారంభించారు. సుమారు 50 లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఒక ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనితో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ బిజినెస్ ఆఫీసర్ డి.ఎం.రాజు, కిషోర్ నాయుడు, నారిన శ్రీనివాసరావు, బండారు నాని, సోమే శ్వరావు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల పుస్తకావిష్కరణ



కాళ్ళలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా ఇన్‌చార్జి ప్రసాదరాజు, తదితరులు

కాళ్ళ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన వైసీపీ పోరాటం చేస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద రాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణరాజులతో పాటు కలిసి 'జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం ప్రజా కోర్టు చార్జిషీట్ అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగన్మోహనరెడ్డి పరిపాలన, కూటమి సంవత్సర పాలన మీద ప్రజలకు అవగాహన కల్పించేందుకు పుస్తకావిష్కరణ చేసినట్లు తెలిపారు.

పాలకొల్లు అర్బన్: జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆవిష్కరించారు. నియోజక వర్గ ఇన్‌చార్జీ గుడాల గోపి అధ్యక్షత వహించారు.

ఆచంట: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ప్రభుత్వ వైఫల్యాలపై సోమవారం తూర్పుపాలెంలోని క్యాంప్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు పుస్తకావిష్కరణ చేపట్టారు. అరాచకాలు, దుర్మార్గాలు దిగజారిన శాంతిభద్రతలు, తీవ్ర అధికార దుర్వినియోగం, తప్పుడు కేసులు, మహిళలు, చిన్నారులుపై ఘోరాలు తదితర సంఘటనలు కూటమి ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్నాయని శ్రీరంగనాథరాజు ధ్వజమెత్తారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పాలకోడేరు, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కి చెందిన పదవ తరగతి విద్యార్థులు తమ పాఠశాలకు జిరాక్స్ ప్రింటర్, రికార్డులు భద్రపరచుకోవడానికి ఐరన్ బీరువాను రూ.50వేల రూపాయలతో కొనుగోలు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మహేష్‌బాబు కు సోమవారం అందజేశారు. ఈ సంవత్సరం పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ప్రవళికశ్రీకి 5వేల రూపాయలు అందజేశారు.

యోగాతో ఆరోగ్యం

గణపవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఉల్లాసం కలుగుతాయని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.స్వరూపరాణి అన్నారు. సోమవారం చింతలపాటిమూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత యోగాసనాలు వేశారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

గణపవరం, జూన్16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో డయేరియా ప్రబలే అవకాశం ఉందని ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గణపవరం ప్రభుత్వ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ కోరారు. సోమవారం గణపవరంలో సచివాలయ ప్రాంతాల్లో డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు అతిసార నిరోధక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఉండి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. కోలమూరు గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను మంత్రి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దుర్గ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ సమయంలో తీసుకొచ్చిన జీవో ప్రభావంతో కోలమూరు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 90 నుండి 10 కి తగ్గిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ పాఠశాలకు పూర్వవైభవాన్ని తీసుకొస్తామన్నారు. బీజేపీ నర్సాపురం పార్లమెంటు కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, జన సేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, డీఈఓ నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు సుమారు 25 మంది విద్యార్థులకు రూ.5వేలుచొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలను పంపిణీ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తణుకు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతతూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ డీవీవీఎస్ అశోక్ వర్మకు వినతి పత్రం అందజేశారు. సోమవాంరం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు తహసీల్దార్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. రబీలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన హమాలీల చార్జీలు, రవాణా చార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు. దువ్వ పరిధిలోని కొండయ్యపాలెం పంట కాలువ గట్టును తవ్వేసిన మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు.







పెనుమంచిలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని.. తాడేపల్లిగూడెంలో ఏలూరు కాలువకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులు..నరసాపురంలో మోటార్ల స్విచ్ ఆన్ చేస్తున్న విప్ నాయకర్

నెలాఖరులోగా ధాన్యం సొమ్ము చెల్లిస్తాం

ఆచంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాది రౌడీ ప్రభుత్వం కాదని, ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంచిలి, శేషమ్మచెరువులలో సోమవారం పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది పంట దిగుబడి అధికంగా ఉండటంతో కొంత మంది రైతులకు సొమ్ములు చెల్లింపులో జాప్యం జరిగిందని ఈ సమస్యను అధిగమించి ఈ నెలాఖరు లోపు మిగిలిన రైతులకు సొమ్ములు చెల్లిస్తామన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీలతో, వర్గాలతో ఎటువంటి సంబంధం లేదని కేవలం అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. అనంతరం గ్రామస్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేషుల శేషవాణి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాసరావు, సిద్దాంతం మార్టేరు డీసీ చైర్మన్‌లు తమ్మినీడి ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలువల్లో చెత్తవేస్తే రూ.10వేల ఫైన్

తాడేపల్లిగూడెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాలువల్లో చెత్తవేసేవారిని గుర్తించి రూ.10వేలు ఫైన్ విధించాలని మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాలు ఇచ్చారు. సుమారు రూ.20లక్షలతో చేపట్టిన ఏలూరుకాలువ ఆధునీకరణ పనులను పూర్తయిన సందర్భంగా సోమవారం కాలువకు నీరు విడుదల చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పెద్ద శివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ నిడదవోలు మొదలుకుని ఏలూరు వెళ్లే వరకు అందరూ ఈ కాలువ నీటిని తాగునీరు, సాగునీరుగా వినియోగిస్తున్నారన్నారు. ఇలాంటి నీటిని కలుషితంచేయడం ద్వారా ప్రజలను అనారోగ్యాల పాలు చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, కూటమిని నాయకులు వర్తనపల్లి కాశీ,అడపా ప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: నియోజకవర్గంలోని 28 మందికి రూ.29,63,588 విలువ కలిగిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బొలిశెట్టి అందజేశారు.

మంచినీటి చెరువులోకి నీటి తోడకం

నరసాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కాలువలకు నీటిని విడుదల చేయడంతో సోమవారం మునిసిపల్ అధికారులు చెరువుల్లోకి నీటి తోడకానికి శ్రీకారం చుట్టారు. నీరు తోడకానికి ఏర్పాటు చేసిన మోటార్లను విప్ నాయకర్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం చెరువును, వాటర్‌వర్క్స్‌ను పరిశీలించారు. శుద్ధి చేసిన నీటినే ప్రజలకు అందించాలన్నారు. శివారు ప్రాంతాలకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ అంజయ్య, కోటిపల్లి సురేష్, వెంకటేశ్వరావు పాల్గొన్నారు

వృద్ధులపై వేధింపులు నివారించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వృద్ధుల సంక్షేమ సంఘ నాయకులు

తణుకు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులపై పెరుగుతున్న వేధింపులను నివారించాలని మంగళవారం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మకు సీనియర్ సిటీజన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈసందృంగా పలువురు మాట్లాడుతూ వృద్ధులు గౌరవ ప్రదంగా జీవించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. ముందుగా రాష్ట్రపతి రోడ్డులోని సంఘ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, శనివారపు చలపతిరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: వృద్ధుల పట్ల దూషణ, నిర్లక్ష్యం, శారీరక మానసిక, లైంగిక వేధింపులు, ఆర్థిక దుర్వినియోగం అరికట్టి భద్రతను, సంతోషాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ వై.దుర్గా కిషోర్‌కు సీనియర్ సిటిజన్ల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు వంగా నరసింహారావు, మాఘం బాలకొండలరావు, అత్యం ఆది శేషారావు, కొండ్రెడ్డి సూర్యనారాయణ, యర్రంశెట్టి వెంకటరత్నం, కారుమూరి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: రోజురోజుకు వృద్ధులపై పెరిగిపోతున్న అఘాయిత్యాలు, వేధింపుల నుంచి రక్షించాలని భీమవరం వృద్ధుల సంక్షేమ సంఘాల సభ్యులు సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణికి విజ్ఞాపన పత్రం అందించారు. ప్రపంచ వయోవృద్ధులు వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అసోసియేషన్ తరుపున ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జిల్లా కార్యదర్శి కోటికలపూడి చిట్టివెంకయ్య, భీమవరం సంఘ అధ్యక్షుడు నల్లం నాగేశ్వరవు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయిన్ నిర్మాణ పనులు



డీఎల్‌కే రోడ్డులో తవ్వుతున్న డ్రెయిన్

తణుకు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎల్‌కే రోడ్డులో డ్రెయిన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 3, 4వార్డుల పరిధిలోకి వచ్చే డ్రెయిన్ నిర్మాణ పనులు చేయడంతో ఆయా వార్డుల్లో ఎప్పటి నుంచో ఉన్న మురుగునీటి సమస్య తీరనుంది. వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్ నిర్మాణ పనులు కావాలనే నిలిపి వేశారనే ఆరోపణలు ఉన్నాయి. సగం మేరకు డ్రెయిన్ నిర్మాణం చేసి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నివాసం ఉండే ఇంటి వైపున డ్రెయిన్‌ను కావాలనే నిలిపి వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పొలంగి మురుగునీరుతో పాటు వార్డులో మురుగునీరు ప్రవాహం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దాఖలాలు ఉన్నాయి. దీంతో ఆరిమిల్లి ఎమ్మెల్యే అయిన తర్వాత డ్రెయిన్ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఇపుడు చాలా వరకు పనులు పూర్తయ్యాయి. ఈ డ్రెయిన్ ఉండ్రాజవరం జంక్షన్ వరకు చేపడతారు.

మెగా డీఎస్సీకి 82 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 పరీక్ష ఐదు కేంద్రాల్లో సోమవారంనాడు జరగ్గా మొత్తం మీదు 82 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో 605 మందికి గాను 561 మంది హాజరయ్యారు. 44 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం సెషన్‌లో 597 మందికి గాను 559 మంది హాజరయ్యారు. 38 మంది హాజరు కాలేదు. మొత్తం 1202 మందికి గాను 1120 మంది పరీక్షకు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖా ధికారి ఈవీవీఎస్ఎస్ఎస్ బిఎల్ నారాయణ తెలిపారు. స్క్వాడ్ టీమ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా జరిగిన పరీక్షలో 309 మంది అభ్యర్థులకు గాను 293 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు.

నరసాపురం: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 200మందికి గాను 20 మంది గైర్హాజరయ్యారు. గేటు వద్ద, కళాశాల ప్రాంగణంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. హాల్‌టిక్కెట్ ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించారు. పరీక్షల ఇన్విజిలేటర్‌గా వైస్ ప్రిన్సిపాల్ గోపిచంద్ వ్యవహరించారు.

యోగా విధులకు కమిషనర్లు

భీమవరం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న విశాఖ పట్నంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర -2025 కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న నేపథ్యంలో వివిధ పనులు పర్యవేక్షించేందుకు మునిసిపల్ రీజనల్ డైరక్టర్ సీహెచ్ నాగ నరసింహరావుతోపాటు జిల్లా నుంచి ఇద్దరు కమిషనర్లను విశాఖకు పంపించారు. భీమవరం మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రా రెడ్డి తోపాటు తణుకు కమిషనర్ టి రమణకుమార్‌ను పంపిచారు. ఈ మేరకు ఉత్తర్వులు రావటంతో కమిషనర్లు బయలుదేరి వెళ్ళారు. అక్కడ వారికి అప్పగించిన బాధ్యతలను నెరవేస్తారు. మొత్తం 8 మంది కమిషనర్లను విశాఖకు పంపించారు.



ట్రాఫిక్ నియంత్రణపై సీఐ రజనీ కుమార్ సూచనలు

మాడవీధుల్లో భక్తుల ప్రదక్షిణలు

పాలకొల్లు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఏకవార రుద్రాభిషేకాలు, గోపూజలు చేశారు. సాయంత్రం సప్త సోమవారాల్లో భాగంగా 2వ వారం సప్త మారేడు దళాలతో సుమారు 1500 మంది భక్తులు మాడ వీధుల్లో మేళ తాళాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం పంచహారతులు ఇచ్చి, ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి వాసు, అర్చకులు పాల్గొన్నారు.

మాడవీధుల్లో భక్తులు ప్రదక్షిణలు చేస్తున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ కె రజనీ కుమార్ సోమవారం ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసమయంలో ట్రాఫిక్ మళ్ళించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాధురి



పాలకొల్లు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై డాక్టర్ యర్రా మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ రవి కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది డాక్టర్ మాధురిని అభినందించారు.



ఇరగవరం పంట కాలువ

పంట కాలువలకు కొత్త శోభ

ఇరగవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఐదేళ్లపాటు పంట కాలువల్లో పూడికతీత పనుల జోలికి వెళ్ళలేదు. దీంతో పంట కాలువల్లో పూడిక పెరిగిపోయి సాగుకు నీరు అందక రైతులు అవస్థలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సాగునీటి సంఘాల వ్యవస్థను పునరుద్ధరించి ఈ వేసవిలో పంట కాలువల నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలో చేపట్టిన పూడిక తీత పనులు చాలా వరకు పూర్తి కావొచ్చాయి. తణుకు నియోజకవర్గంలో కోటి 20 లక్షల రూపాయలతో సుమారు 35 కిలో మీటర్లమేర పూడిక తీత పనులు చేపట్టామని, ప్రస్తుతం కె సముద్రపుగట్టు వద్ద ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని మరో రెండు రోజుల్లో పూర్తి అవుతాయని తణుకు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ తెలిపారు.



గంగాధర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తపనా చౌదరి

జర్నలిస్టు గంగాధర్‌కు పరామర్శ

భీమవరం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చలువాది గంగాధర్‌ను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన) పరామర్శించారు. బుధవారం గంగాధర్ తండ్రి విజయశ్రీ కాళిదాస్ రాజయోగేంద్ర మరణించడంతో, విషయం తెలుసుకున్న గారపాటి చౌదరి సోమవారం గంగాధర్ నివాసానికి వెళ్లి, కాళిదాస్ చిత్రపటానికి పుష్పమాలవేసి నివాళి అర్పించారు.

ల్యాప్‌టాప్‌ల అందజేత

భీమవరం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో విభిన్న ప్రతి భావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.2.88 లక్షల విలువగల ల్యాప్ ట్యాప్‌లను ఉచితంగా అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన ఎనిమిది మంది ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ రెగ్యులర్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చ దలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

విద్యా సామగ్రి అందజేత

పెనుమంట్ర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఆళ్ళ రాము, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కోడి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ చింతపల్లి రామకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెనుమత్స రాఘవేంద్ర రాజు, జనసేన గ్రామ అధ్యక్షుడు తోరం వెంకన్న బాబు, బీజేపీ గ్రామ అధ్యక్షుడు యామజాల కాశి విశ్వనాథం పాల్గొన్నారు.త

శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన విత్తనాలు వాడాలి

నరసాపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సార్వా పంటలో రైతులు విత్తనాలు వేసేటప్పుడు మార్టేరు వరి పరిశోధన శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన వరి వంగడాలే నాటాలని వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమారి కోరారు. సోమవారం నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు రైతులకు విన్నవించారు. ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే విధంగా ఎంటీయూ 1232, ఎంటీయూ 1100, ఎంసీఎం 100 మ్యూ 1293 వంటి రకాల విత్తనాలను సాగు చేయాలన్నారు. ఈనెల 20న అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద నరసాపురంలో 8245, మొగల్తూరు 4017, యలమంచిలి మండలంలో 5874 మంది అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రంలో ఈకైవైసీ నమోదు చేయించుకోవాలన్నారు.

డబుల్ మేజర్‌పై అవగాహన సదస్సు

ఆకివీడు రూరల్ జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దుంపగడపలోని వీవీగిరి కళాశాలలో డిగ్రీ కోర్సులు ఈ విద్యా సంవత్సరంలో డబుల్‌మేజర్ విధానంలో అడ్మిషన్‌లు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత తెలిపారు. డబుల్ మేజర్ విధానంపై ఈనెల 18వ తేదీన కళాశాల ఆవరణలో ఉదయం 11గంటల నుంచి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఉన్న గ్రూపు సబ్జెక్టులలో ఒక దానితో సింగిల్ మేజర్ విధానం అమలులో ఉండేదని, దీనిని ప్రస్తుతం రెండు సబ్జెక్టులతో డబుల్ మేజర్ విధానాన్ని తీసుకు వచ్చారని తెలిపారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఆకివీడు రూరల్ జూన్16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం కార్యక్రమం చదువుకోవడానికి ధైర్యానిస్తున్నదని విద్యార్థులు అన్నారు. దుంపగడప గ్రామంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్థికంగా స్తోమత లేకపోయినా అష్టకష్టాలు పడి తమను తమ తల్లిదండ్రులు చదివిస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులతో తమ చదువులు ఎప్పుడు ఆగిపోతాయో అనే భయంతో విద్యనభ్యసించే వారమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం కార్యక్రమం ద్వారా విద్యనభ్యసించడానికి డోకాలేదనే ధైర్యం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ ముద్దేవిశ్వేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

పాలకొల్లు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మంత్రి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 92 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి వచ్చిన 68 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు మంత్రి డాక్టర్ నిమ్మల అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జీవి, తమ్మినీడి సత్యనారాయణరావు, వల్లభు శ్రీనివాస్, అల్లం తాతాజీ, జగ్గురోతు రాంబాబు, ఫకీర్ బాబు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని పాత బజార్ ప్రాంతంలో అనారోగ్యంతో బాధపడుతున్న మహ్మద్ సయ్యద్ అహ్మద్‌కు శస్త్ర చికిత్స నిమిత్తం మంజూరైన రూ.7లక్షల చెక్కును ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్ అందించారు. సోమవారం బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రామరాజు, జక్కం శ్రీమన్నారాయణ, బేగం, మౌలాలీ, వాతాడి ఉమా పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ప్రధానోపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఎంఈవో వి.హనుమ సూచించారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలో పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

పుస్తకాల పంపిణీ

నరసాపురం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్కూల్ చైర్మన్ ఎం.సోమేశ్వరి, కోటి, వేణుగోపాల్, మాహూరి ఆనంద్ విచ్చేసి విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు అందించారు.

యోగా దినోత్సవానికి తరలిరావాలి

తణుకు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. మంగళవారం విశాఖజిల్లా గాజువాక నియోజ కవర్గ పరిశీలకులుగా గాజువాక నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. విశాఖపట్నం వేదికగా ముఖ్యమంతి చంద్రబాబు నాయడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి మోదీ సహకారంతో నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. యోగా దినోత్సవం కార్యక్రమం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదయ్యేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.